క్లుప్తంగా

లేపాక్షిలో పర్యాటకుల సందడి



నంది విగ్రహం వద్ద పర్యాటకులు

లేపాక్షి: లేపాక్షిలోని వీరభద్రస్వామి దేవాలయంలో శనివారం పర్యాటకుల సందడి చోటు చేసుకుంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని అనేక ప్రాంతాలతో పాటు కర్ణాటక నుంచి కూడా పర్యాటకులు విచ్చేసారు. వాతావరణం చల్లగా ఉండడంతో పర్యాటకులు ఆలయంలో కిక్కిరిసి పోయారు. ఆలయంలోని శిల్పాలు, చిత్రలేఖనాలను తిలకించారు. పిల్లపాపలతో పర్యాటకులు ఆహ్లాదకరమైన పార్కింగ్ వద్ద కాలక్షేపం చేశారు. అనంతరం నంది విగ్రహం, థీం పార్కు, జటాయువు పక్షి విగ్రహం తదితర ప్రదేశాలను చూసి ఆనందం వ్యక్తం చేసారు.

బీసీజీ వ్యాక్సిన్ వేయించుకోండి

మడకశిరరూరల్: ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం బీసీజీ వ్యాక్సినేషన్‌కు శ్రీకారం చుట్టింది. ప్రజలు టీకా వేయించుకుని సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని మాజీ మంత్రి రఘువీరారెడ్డి సూచించారు. శనివారం ఆయన నీలకంఠాపురం పీహెచ్‌సీలో బీసీజీ టీకా వేయించుకున్నారు. గ్రామాల్లో 60 ఏళ్ల పైబడిన వారు టీకాను వేయించుకుని క్షయ వ్యాధి భారిన పడకుండా ఆరోగ్యంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ జయవర్ధన్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.


కల్లూరు సుబ్బారావుకు ఘన నివాళి



కల్లూరు సుబ్బారావు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: పద్మశ్రీ కల్లూరు సుబ్బారావు 127వ జయంతిని పురస్కరించుకుని శనివారం లైఫ్ వరల్డ్ ప్రతినిధి ఉదయ్ కుమార్ ఆధ్వర్యంలో స్థానిక ఇందిరా పార్కులోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సువర్ణభారతి కళాశాల ఏఓ అనిల్, ఎమ్మార్పీఎస్ ఆంజనేయులు, పెన్షనర్స్ అసోసియేషన్ లోకేష్, వెంకటేశ్వర్లు, ఆంజనేయులు, ఎస్‌డీజీఎస్ కళాశాల ప్రిన్సిపాల్ నాగేంద్ర, శైలజ, చైతన్య గంగిరెడ్డి, ముస్లిం నగారా ఉమర్‌ఫారూక్, లక్ష్మీనారాయణ, శివ తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలో నానెప్పనగర్‌లో కల్లూరు సుబ్బారావు మనవడు కల్లూరు ఆదినారాయణ రావు ఆధ్వర్యంలో జయంతి వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘం నాయకులు చక్రపాణి, అనిల్, ఆర్యవైశ్య సంఘం శ్రీనివాసులు, దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేత ఈరన్న మృతి



పావగడ: తాలూకాలోని చిత్తగానహళ్లి గ్రామానికి చెందిన బోయ సి.ఈరణ్ణ (75) గుండెపోటుతో శుక్రవారం రాత్రి స్వగృహంలో మృతి చెందారు. ఈరన్న గతంలో బ్యాడనూరు మండల పంచాయతీ ప్రధాన్‌గా పని చేశారు. అలాగే కన్మేడి గ్రామ పంచాయతీ సభ్యుడిగా 5 పర్యాయాలు విధులు నిర్వహించి, పంచాయతీ పరిధిలో అనేక అభివృద్ధి పనులు చేపట్టారు. మృతుడికి భార్య రామక్క, ఇద్దరు కుమారులు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. స్థానిక ఎమ్మెల్యే హెచ్.వి వెంకటేశ్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈరన్న మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ మంత్రి వెంకట రమణప్ప, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎ.శంకరరెడ్డి, వాల్మీకి సంఘం నాయకులు, కాంగ్రెస్ నాయకులు సంతాపం ప్రకటించారు.

అంబేడ్కర్ ఆశయాలు నెరవేర్చాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కేఎం తిమ్మరాయప్ప

పావగడ: భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ ఆశయాలను నెరవేర్చాలని మాజీ ఎమ్మెల్యే కేఎం తిమ్మరాయప్ప యువతకు సూచించారు. తాలూకాలోని బీకే హళ్ళి గ్రామ పంచాయతీ ఆవరణలో స్థానిక అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు శివానంద, తదితర పదాధికారుల ఆధ్వర్యంలో శనివారం అంబేడ్కర్ జయంతి జరుపుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అంబేడ్కర్ ఏ ఒక్క వర్గానికి చెందిన వాడు కాదన్నారు. అన్ని సామాజిక వర్గాల అభివృద్ధికి పాటుపడిన మహా నాయకుడని కొనియాడారు. అతడి ఆశయాలు, సిద్ధాంతాలు కొనసాగించే బాధ్యత ప్రతి భారతీయుడిపై ఉందన్నారు. అనంతరం అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ జీవిత చరిత్రను ప్రధాన వక్త బెంగళూరు యూనివర్సిటీ అధ్యాపకుడు కరియణ్ణ నిషేధ్ వివరించారు. కార్యక్రమంలో రూరల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రామాంజినప్ప, మాలమ్మ, హనుమంతరాయప్ప, సీకే తిప్పేస్వామి, ఉగ్రప్ప తదితర దళిత నాయకులు పాల్గొన్నారు.



గుడిబండ: భారీ వర్షాలకు కుంటలో నిలిచిన నీరు



మడకశిరరూరల్: అయ్యవారిపల్లి వద్ద నీటితో నిండిన కుంట

భారీ వర్షం.. రైతన్నల హర్షం

- మడకశిరలో 72.2 మి.మీ వర్షపాతం నమోదు
- వర్షపు నీటితో నిండిన చెక్‌డ్యామ్‌లు
- కూలిన విద్యుత్ స్తంభాలు
- 19 గంటల పాటు విద్యుత్ సరఫరా బంద్



రొద్దంలో వర్షానికి కూలిన ఇంటిని చూపుతున్న బాధిత మహిళ

మడకశిరరూరల్: మండలంలో శుక్రవారం రాత్రి ఈదురు గాలులు, ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసింది. అర్ధరాత్రి సమయంలో జిల్లెడుగుంటలో కొబ్బరి చెట్టుపై పిడుగు పడి మంటలు ఎగసిపడ్డాయి. అమితు ఎలాంటి ప్రాణపాయం జరగలేదు. మండలంలో 72.2 మి.మీ వర్షపాతం నమోదైంది. ఈ వర్షానికి వంకలు ప్రవహించి చెక్‌డ్యామ్‌లు నీంటితో నిండి పోయాయి. పెనుకొండ రోడ్డులో విద్యుత్ స్తంభాలు విరిగిపడిపోవడంతో శుక్రవారం రాత్రి 9 గంటల నుంచి శనివారం మధ్యాహ్నం 2:30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ అధికారులు మరమ్మతులు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రహరీ కూలిపోయింది. దొమ్మరహట్టి వద్ద గాలికి ఇంటి పైకప్పు రేకులు పొలంలోకి ఎగిరి పోయాయి. జమ్మానిపల్లి గ్రామ సమీపంలోని దెయ్యాలపల్లి మల్లమ్మ చెరువుకు భారీగా వర్షపు నీరు చేరింది.

విస్తారంగా వర్షాలు

మడకశిర: నియోజకవర్గ వ్యాప్తంగా శుక్రవారం రాత్రి భారీ వర్షాలు కురిశాయి. మడకశిరలో కుండపోత వర్షం కురిసింది. వంకలు,వాగులు ప్రవహించాయి. చెక్‌డ్యామ్‌ల్లోకి నీరు చేరాయి. మడకశిరలో 72.2 మి.మీ వర్షపాతం నమోదైంది. అమరాపురంలో 42.4, గుడిబండలో 37.8, రొళ్లలో 5.4, అగళిలో 4 మి.మీ చొప్పున వర్షపాతం నమోదైనట్లు ఏడీఏ కృష్ణమీనన్ తెలిపారు.

అమరాపురం: మండలంలో శుక్రవారం రాత్రి ఈదురు గాలులతో కూడిన భారి వర్షానికి విద్యుత్ స్తంబాలు, వక్క చెట్లు నేల కొరిగాయి. దీంతో ఈరన్నకు చెందిన కారు పై కప్పు పూర్తిగా దెబ్బతింది. విద్యుత్ స్తంభాలు, తీగలు నేల కొరిగాయి. అయితే ఆ సమయంలో విద్యుత్ సరాఫరా లేక పోవడంతో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. విద్యుత్ సరఫరా ఉంటే చాలా ప్రమాదం జరిగేదని స్థానికులు సోము, ఈరన్న, ప్రశాంత్‌కుమార్, అజ్జయ్య, సిద్దేశ్వర, గుండప్ప తదితరులు తెలిపారు. పెద్ద ప్రమాదం తప్పిందన్నారు. అలాగే సిద్దప్ప, చిగరంగప్ప, నాగరాజు, రుద్రప్ప, తదితర తోటల్లో వక్క చెట్లు నేలకొరిగాయి.

గుడిబండలో..

గుడిబండ: మండల వ్యాప్తంగా శుక్రవారం రాత్రి ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురిశాయి. రాత్రి కురిసిన భారీ వర్షాలకు పంట పొలాల్లో భారీగా నీరు నిలిచాయి. అత్యధికంగా గుడిబండలో 37.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

మండలంలో భారీ వర్షం

రొద్దం: మండల వ్యాప్తంగా శుక్రవారం రాత్రి భారీ వర్షం కురిసింది. వాగులు, కుంటలు, చెక్ డ్యాంలు పొంగి పొర్లాయి. భారీవర్షం కురవడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అదునులో పదునైన వర్షం కురవడంతో సేద్యానికి అనుకూలంగా ఉంటుందని చెప్తున్నారు. జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల వద్ద వర్షపు నీరు భారీగా చేరింది. భారీ వర్షానికి కూలిన ఇంటి పైకప్పు : మండల కేంద్రంలోని బ్రాహ్మణ వీధిలో నివాసం ఉంటున్న కళావతి అనే మహిళ ఇంటి పైకప్పు శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి కూలిపోయింది. ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో ఇంటి పైకప్పు కూలినట్లు బాధిత మహిళ తెలిపింది.



రొద్దం హౌసింగ్ లేఅవుట్‌లో ఇళ్ల మధ్య నిలిచిన వర్షపునీరు

లేపాక్షిలో 9.6 మిమీ వర్షపాతం

లేపాక్షి: మండల వ్యాప్తంగా శుక్రవారం రాత్రి 9.6 మిమీ వర్షపాతం నమోదైందని ఏఓ శ్రీలత శనివారం తెలిపారు. ఈ నెలలో సాధారణ వర్షపాతం 49.3 మిమీ కాగా ఇప్పటి వరకు 113.2 మిమీ వర్షపాతం నమోదైందన్నారు. వంకలు, చిన్నచిన్న చెక్‌డ్యాంలు, కాలువలు నిండడంతో పశువులు, మేకలు, గొర్రెలకు తాగునీటి సమస్య తీరినట్లయిందని రైతులు హర్షం వ్యక్తం చేశారు.



అమరాపురంలో కారుపై పడిన విద్యుత్ స్తంభాన్ని తొలగిస్తున్న దృశ్యం



మడకశిరరూరల్: దొమ్మరహట్టి వద్ద పొలంలో ఒరిగిన విద్యుత్ స్తంభం



అమరాపురంలో నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు



దొమ్మరహట్టిలో ఇంటి పైకప్పు రేకులు పొలంలోకి ఎగిరిపోయిన దృశ్యం

వచ్చేది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప

మడకశిరరూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ప్రజాధారణ లభించింది. వచ్చేది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనని ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప తెలిపారు. శనివారం సాయంత్రం ఆయన నాయకులతో కలిసి మండలంలో పర్యటించారు. హెచ్‌ఆర్ పాళ్యం గ్రామంలో ఎంపీపీ కవిత, నాయకులను కలిసి పోలింగ్ సరళిని అడిగి తెలుసుకున్నారు. అన్ని వర్గాల ప్రజలు వైఎస్సార్‌సీపీ పక్షానే నిలిచారని తెలిపారు. నియోజకవర్గంలో మంచి మెజార్టీతో వైఎస్సార్‌సీపీ విజయం సాధించడంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా సీఎం వైఎస్ జగన్ చెప్పినట్లు గత ఎన్నికల ఫలితాలను మించి ఈ సారి స్థానాల్లో గెలవడం ఖాయమన్నారు. ప్రజల ఆశీస్సులతో రెండో సారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపడతారని ధీమా వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో కూటమికి ఓటు ద్వారా గుణపాఠం చెప్పడం ఖాయన్నారు. అనంతరం ఈరలక్కప్పను నాయకులు సన్మానించారు.

సంక్షిప్త సమాచారం

కొనసాగుతున్న వైద్య శిబిరం

రొళ్ల: మండల పరిధిలోని కాకి గ్రామంలో శనివారం వైద్య శిబిరం కొనసాగింది. ఈనెల 21వ తేదీ నుంచి అతిసారతో వాంతులు, విరేచనాలతో ప్రజలు బాధపడుతున్న విషయం తెలిసిందే. గత ఐదు రోజులుగా రొళ్ల సీహెచ్‌సీ సిబ్బంది వైద్య శిబిరం ఏర్పాటు చేసి చికిత్సలు అందిస్తున్నారు. అతిసార సోకడం వల్ల సుమారు 30 నుంచి 40 మంది వరకు ప్రజలు వాంతులు, విరేచనాలతో తీవ్ర అస్వస్థతకు గురి కావడంతో ప్రత్యేకంగా ఆరోగ్య శాఖ అధికారులు, పంచాయతీ రాజ్‌శాఖ సిబ్బంది గ్రామంలోనే వైద్య చికిత్సలు అందిస్తున్నారు. రక్షిత మంచినీటి ట్యాంకులు, కుళాయిలు, డ్రైనేజీలను శుభ్రం చేయించారు. ఇటీవల కురిసిన వర్షానికి వాతావరణ మార్పులతో పాటు కలుషిత నీటిని తాగడం వల్ల ఈ వ్యాధి వ్యాపించినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ ఖాదర్‌వలీ, హెల్త్ అసిస్టెంట్లు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశ వర్కర్లు, పంచాయతీ రాజ్‌శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

పెనుకొండ: రోడ్డు ప్రమాదంలో గాయపడి స్థానిక ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ యువకుడు శనివారం మృతిచెందాడు. ఎస్‌హెచ్‌ఓ దాదాపీర్ తెలిపిన మేరకు.. శుక్రవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో గుర్తు తెలియని వాహనం రోడ్డు పక్కన నిలబడి ఉన్న గుర్తు తెలియని వ్యక్తిని (36) ఢీకొనింది. దీంతో అతను తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే ప్రభుత్వ సర్వజనాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి ఆచూకీ తెలిస్తే పెనుకొండ పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

చిరుత దాడిలో మేక మృతి

రొళ్ల: మండల పరిధిలోని బంద్రేపల్లి గొల్లహట్టిలో శుక్రవారం అర్ధరాత్రి చిరుత దాడిలో మేక మృతి చెందింది. బాధితుడు శివన్న తెలిపిన వివరాలు.. జీవనాధారం కోసం ఐదు మేకలను రూ.55 వేలు ఖర్చు పెట్టి కొనుగోలు చేశాడు. రోజు మాదిరిగానే మేత కోసం గ్రామ పొలిమేరకు తీసుకెళ్లి తిరిగి సాయంత్రం ఇంటి పక్కనే ఉన్న వారపాకలో వదిలాడు. అర్ధరాత్రి ఉన్నఫళంగా చిరుత మందపై దాడి చేసింది. ఒక మేకను నోటితో పట్టుకుని పరుగులు తీసింది. ఒక్కసారిగా మేకలు బెదరడంతో వెళ్లి చూడగా అప్పటికే ఒక మేక మందలో లేనట్లుగా గుర్తించాడు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి

పెనుకొండ రూరల్: ద్విచక్రవాహనం అదుపుతప్పి బోల్తా పడిన ఘటనలో గాయపడి, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ అక్కులప్ప (65) శనివారం మృతిచెందాడు. కియా ఎస్ఐ రంగడు తెలిపిన మేరకు.. చెన్నేకొత్తపల్లి మండలం ఒంటికొండకు చెందిన అక్కులప్ప ఐదు రోజుల క్రితం గుట్టూరు వద్ద 44వ జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనం అదుపు తప్పి కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడిన వృద్ధుడిని మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అనారోగ్యంతో వీఆర్వో మృతి



ఓబలేష్ (ఫైల్)

అమరాపురం: మండల పరిధిలోని వలస గ్రామ సచివాలయంలో వీఆర్వోగా విధులు నిర్వర్తిస్తున్న ఓబలేష్ (43) అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మృతి చెందారు. ఈయన అమరాపురం, తమ్మడేపల్లి, కె.శివరం, హేమావతి, వలస గ్రామ వీఆర్వోగా సేవలు అందించడంతో పాటు పొరుగున ఉన్న అనంతపురం జిల్లా కుందుర్పి మండలంలో వీఆర్వోగా విధులు నిర్వర్తించారు. గత నాలుగు నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్న వీఆర్వో ఓబులేష్ వైజాగ్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. మృతుడికి తల్లి, భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ వెంకట సుబ్బయ్య, ఆర్ఐ, వీఆర్వోలు, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, వీఆర్ఏలు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఓబులేష్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వాగేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

‘ఎంఈఓను సస్పెండ్ చేయాలి’

హిందూపురం టౌన్: కార్పొరేట్ పాఠశాలలకు కొమ్ముకాస్తున్న ఎంఈఓ గంగప్పను సస్పెండ్ చేయాలని ప్రగతి శీల విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మంజుల నరేంద్ర కోరారు. పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాలలో ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా అడ్మిషన్లు నిర్వహిస్తున్నారని, పాఠశాలలో పాఠ్యపుస్తకాలను విక్రయిస్తున్న వాటిని వారు పరిశీలించారు. పుస్తకాలు అధిక ధరలకు విక్రయిస్తున్నా ఎంఈఓ పట్టించుకోవడం లేదన్నారు. దీనిపై ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రగతిశీల విద్యార్థి సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

అమరాపురం: స్థానిక ప్రాథమిక పాఠశాల మెయిన్‌లో ఆదివారం ఆరోగ్య మైత్రి కూటమి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు కూటమి సభ్యుడు డాక్టర్ బసవరాజు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరానికి కర్ణాటక రాష్ట్రం చిత్రదుర్గం నుంచి స్త్రీల వ్యాధి నిపుణురాలు జ్యోతి విజయ్ కుమార్, పావగడ నుంచి సామాన్య వ్యాధి నిపుణుడు ఓంకార్‌నాయక్ హాజరవుతారన్నారు. మండలంలోని రోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కూటమి సభ్యులు కోరారు. ఉదయం 9 గంటల్లో టోకెన్లు తీసుకోవాలని సూచించారు.

నరసంబుదిలో కార్డెన్ సెర్చ్



గ్రామస్తులకు సూచనలిస్తున్న పోలీసులు

అగళి: మండల పరిధిలోని నరసంబుది గ్రామంలో శనివారం పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. అనుమానితుల ఇళ్లలో సోదాలు చేపట్టారు. 144 సెక్షన్ అమలులో ఉండటంతో నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మడకశిర సీఐలు రాజుకుమార్, మనోహర్ హెచ్చరించారు. అనంతరం ద్విచక్ర వాహనాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎస్ఐలు వీరేష్, మునీప్రతాప్, ఏఎస్ఐలు బాలాజీ, ఆదినారాయణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రిమాండ్‌కు తరలింపు

సోమందేపల్లి: మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను కిడ్నాప్‌నకు పాల్పడిన బోయ రాజు అనే యువకుడిని రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు. ఈనెల 13న బాలిక అదృశ్యం అయినట్లు తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.

కార్మిక చట్టాలను సక్రమంగా అమలు చేయాలి

- న్యాయ విజ్ఞాన సదస్సులో అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ



మిల్లులో పత్తి నుంచి దారం తీయడాన్ని పరిశీలిస్తున్న ఏడీజే కంపల్లె శైలజ

పరిగి: పరిశ్రమల యాజమాన్యాలు కార్మిక చట్టాలను సక్రమంగా అమలు చేయాలని హిందూపురం కోర్టు అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ తెలిపారు. శనివారం మండలంలోని కొడిగెనహళ్లి పరిధిలో ఉన్న సూపర్ స్పిన్నింగ్ మిల్లు యూనిట్‌లో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో న్యాయమూర్తి కంపెల్ల శైలజ పాల్గొన్నారు. తొలుత మిల్లులో కలియతిరిగారు. మిల్లులో ఉత్పత్తవుతున్న ప్రాడక్టుకు సంబంధించిన వివరాలను సంబంధిత అధికారులతో అడిగి తెలుసుకున్నారు. పత్తి నుంచి దారం ఎలా తీస్తారన్న విషయాలను ఆరా తీశారు. దారం నాణ్యత, పత్తి బేళ్లు, తయారీ ప్యాకింగ్, రవాణా తదితర అంశాలపై ఆయా విభాగాల్లో కలియ తిరుగుతూ, యంత్రాలు పని చేసే విధానాలపై జడ్జి పరిశీలించారు. ప్రస్తుతం మిల్లులో అమలవుతున్న కార్మిక చట్టాలపై ఆరా తీశారు. అనంతరం న్యాయమూర్తి శైలజ మాట్లాడుతూ కార్మికుల హక్కులతో పాటూ బాధ్యతలను కూడా గుర్తించాలని తెలిపారు. తమ పిల్లలను తప్పని సరిగా విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని సూచించారు. తల్లిదండ్రులు లేని చిన్నారుల పట్ల కూడా బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న వ్యక్తులు ఉచిత న్యాయం కోసం ఎప్పుడైనా న్యాయస్థానాలను ఆశ్రయించొచ్చన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ న్యాయవాధి శ్రీనివాసరెడ్డి, మిల్లు జనరల్ మేనేజర్ సుబ్బారావు, వివిధ విభాగాల ప్రధానాధికారులు నరసింహాస్వామి, సునీల్ బాబు, సురేష్‌బాబు, లోక్ అదాలత్ సిబ్బంది శారద, హేమావతి, లైజనింగ్ అధికారి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు వైద్య పరీక్షలు చేయించుకోవాలి

పరిగి: గర్భిణులు ప్రతి నెలా ప్రభుత్వాస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని మెడికల్ ఆఫీసర్లు నవీన, స్వరూపరెడ్డి తెలిపారు. శనివారం స్థానిక మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు వైద్య పరీక్షలను నిర్వహించారు. మండలంలోని అన్ని ప్రాంతాల నుంచి వచ్చిన గర్భిణులకు వివిధ రకాల వైద్య పరీక్షలను చేపట్టిన అనంతరం అవసరమైన మందులను, మాత్రలు అందించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ వన్నప్ప, వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మండల కేంద్రానికి చేరిన పాఠ్యపుస్తకాలు



పాఠ్యపుస్తకాలను సర్దుతున్న ఎమ్మార్సీ సిబ్బంది

రొద్దం: మండల కేంద్రానికి ప్రభుత్వ పాఠ్యపుస్తకాలు చేరినట్లు ఎమ్మార్సీ సిబ్బంది శనివారం తెలిపారు. ప్రభుత్వం పాఠశాలలు ప్రారంభానికి ముందే పాఠ్య పుస్తకాలు అందజేయడంతో విద్యార్థులు ఇబ్బందులు ఉండవన్నారు. మొత్తం 8,062 పుస్తకాలు మండలానికి వచ్చాయన్నారు.

ప్రత్యేక అవసరాల చిన్నారుల గుర్తింపు



ప్రత్యేక అవసరాలు గల చిన్నారుల వివరాలు ఆరా తీస్తున్న జిల్లా కోఆర్డినేటర్, సిబ్బంది

పెనుకొండ: పట్టణంలో ప్రత్యేక అవసరాలు గల చిన్నారుల గుర్తించేందుకు శ్రీసత్యసాయి జిల్లా సహిత విద్యా కోఆర్డినేటర్ అలెస్కో ఆనంద్‌బాబు ఐఈఆర్టీ వలిబా, వెంకటరామిరెడ్డి శనివారం పర్యటించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆరేళ్లు పూర్తయిన చిన్నారులు, ప్రత్యేక అవసరాలు గల చిన్నారుల వివరాల కోసం స్థానిక కుమ్మర దొడ్డి తదితర ప్రాంతాల్లో సర్వే చేశారు. ప్రత్యేక అవసరాలు గల చిన్నారుల సదరం స్లాట్ బుక్ చేయించి సదరం సర్టిఫికెట్ వచ్చేలా చూడాలన్నారు. జిల్లా అధికారి ఆనంద్‌బాబు మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు చిన్నారులు భవిత సెంటర్‌కు వచ్చే విధంగా ప్రోత్సహించాలని, వారికి స్పీచ్, ఫిజియోథెరఫి ఇవ్వాలని సిబ్బంది వలీబా, వెంకటరామిరెడ్డికి సూచించారు.

వైభవంగా రంగనాథ స్వామి ఉత్సవాలు



రంగనాథ స్వామిని ఊరేగిస్తున్న దృశ్యం

అగళి: మండల పరిధిలోని ఆలూడి గ్రామంలో శనివారం రంగనాథ స్వామి ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. కర్ణాటకలోని గిడగనహళ్లి గ్రామంలో కొలువైన రంగనాథ స్వామిని పల్లకీలో కొలువుదీర్చి, మేళతాళాల నడుమ అంగరంగ వైభవంగా ఊరేగింపుగా ఆలూడి గ్రామానికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా స్వామికి అభిషేకాలు అర్చనలు తదితర ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం రంగనాథ స్వామిని పల్లకీలో వీధుల్లో ఊరేగిస్తామని గ్రామస్తులు తెలిపారు.

సిగరెట్లకు డబ్బు అడిగినందుకు వ్యక్తిపై దాడి

హిందూపురం అర్బన్: దుకాణం వద్ద జరిగిన గొడవలో ఓ వ్యక్తి గాయపడ్డాడు. వివరాలు.. పట్టణంలోని కోట ప్రాంతంలో నివాసం ఉంటున్న ఇనయతుల్లా డ్రైవర్‌గా పనిచూస్తూ, అతని భార్య చిల్లరకొట్టు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. శుక్రవారం రాత్రి అదే వీధిలో ఉంటున్న యాసీర్ అనే వ్యక్తి దుకాణం వద్దకు వచ్చి సిగరెట్లు కొని ఫోన్‌పే చేశానని చెప్పాడు. అయితే ఫోన్ పేలో నగదు బదిలీ కాలేదని చెప్పడంతో ‘నన్నే డబ్బులు అడుగుతావా’ అంటూ ఇనయతుల్లాపై దాడిచేసి గాయపరిచాడు. దాడికి పాల్పడిన యాసీర్, అతని అన్న చాంద్‌బాషాపై కేసు నమోదు చేసి చర్య తీసుకోవాలని శనివారం బాధితుడు ఫిర్యాదు చేశారు. కేసు విచారిస్తున్నట్లు రెండో పట్టణ పోలీసులు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హిందూపురం: హిందూపురం పట్టణ సబ్ డివిజన్ ముదిరెడ్డిపల్లి సెక్షన్ కొట్నూరు సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ మహేష్‌కుమార్ శనివారం తెలిపారు. కొల్లకుంట, కోట్నూరు, సింగిరెడ్డిపల్లి, ముదిరెడ్డిపల్లి, బారెడ్డిపల్లి, చిన్న గుడ్డంపల్లి, పెద్దగుడ్డంపల్లి, నందమూరినగర్, కగ్గలు, ఎస్.బీరేపల్లి తదితర గ్రామాల్లోని సబ్ స్టేషన్ మరమ్మతు కారణంగా ఆదివారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ కరెంట్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

